క్లుప్తంగా

కెప్టెన్ విజయప్రసాద్ సాహసం తెనాలికే గర్వకారణం



తెనాలి: శ్రీలంకలో ఎల్‌టీటీఈతో జరిగిన ఎదురుకాల్పుల్లో అమరుడైన పట్టణానికి చెందిన పారా కమెండో కెప్టెన్ యర్రమనేని విజయప్రసాద్ 37వ వర్ధంతిని శుక్రవారం స్థానిక చెంచుపేటలోని శబరి వృద్ధాలయంలో నిర్వహించారు. కెప్టెన్ విజయప్రసాద్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కెప్టెన్ విజయప్రసాద్ త్యాగం తెనాలికి గర్వకారణమని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత వేజళ్ల ఉమామహేశ్వర్ అన్నారు. ఆ అమర వీరుడి స్మారకార్థం తల్లిదండ్రులు మీనాకుమారి, వైఎల్ నారాయణ ఏటా పాఠశాల విద్యార్థుల ఉన్నత చదువులకు ఆర్థికసాయం చేస్తూ, వృద్ధులకు చేయూతను అందిస్తున్నారని గుర్తుచేశారు. వృద్ధాప్యంలోనూ సమాజసేవ చేస్తుండటాన్ని అభినందించారు. కార్యక్రమంలో వై.ఎల్.నారాయణ, ఆనందరావు, మురహరిరావు,భుజంగరావు, సత్యం పాల్గొన్నారు. అనంతరం శబరి ఆశ్రమంలోని వృద్ధులకు ఆహారం అందించారు.

14 లోపు ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగించాలి

తెనాలిఅర్బన్: కొత్తపేటలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం రోడ్డులో అనధికారికంగా ఏర్పాటు చేసిన బడ్డీ కొట్లులు, పందిళ్లను సోమవారం లోపు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. వీటిని ఏర్పాటు చేయడం వలన తహసీల్దార్ కార్యాలయం, 1టౌన్ పోలీసు స్టేషన్, కోర్టు సముదాయానికి వచ్చేవారికి అనేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయని చెప్పారు. అలాగే మురుగు కాల్వలను శుభ్రం చేయడానికి ఇవి అవరోధంగా మారాయన్నారు. ఆక్రమణదారులు మున్సిపాలిటీకి సహకరించాలని సూచించారు. లేని పక్షంలో ఆక్రమణలు తొలగించడంతో పాటు దానికైన ఖర్చును కూడా వసూలు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

ఘనంగా పౌర్ణమి సామూహిక హారతులు



తెనాలిరూరల్: ఆషాఢ శుద్ధ పౌర్ణమి, వ్యాస పౌర్ణమిని పురస్కరించుకుని సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంగలకుదురు గేటు వద్ద ఉన్న శ్రీ కోదండ రామాలయాలలో గురువారం రాత్రి పౌర్ణమి సామూహిక హారతులు సమర్పించి భజన సంకీర్తనలు చేశారు. తెనాలి సబ్ డివిజన్ కన్వీనర్ కడియాల సునీల్ కుమార్ మాట్లాడుతూ దీపం పరబ్రహ్మ స్వరూపం అని, సామూహిక హారతులు వల్ల సైన్స్‌పరంగా కూడా చెడు క్రిములు చనిపోయి వాతావరణ సమతుల్యం ఏర్పడుతుందని చెప్పారు. ఆరోగ్యపరంగా నాసికా రంధ్ర, కంటి వ్యాధులు తొలుగుతాయని, దృష్టి దోషాలు తొలగడంతో పాటు స్వామి వారి అనుగ్రహం కలిగి అందరికీ శుభం కలుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా కన్వీనర్లు బద్దుల పద్మ, వరలక్ష్మి, అనిత పాల్గొన్నారు.

ఆలయాల్లో కానుకల లెక్కింపు



తెనాలి: పట్టణంలోని గ్రూప్-2 దేవాలయాల పరిధిలోని స్థానిక రామలింగేశ్వరపేటలో గల శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం స్వామివారి హుండీ లెక్కింపు నిర్వహించారు. భక్తులు సమర్పించిన కానుకలు, మొక్కుబడుల హుండీ లెక్కింపును ఆలయ కార్య నిర్వహణ అధికారి హరిప్రసాద్ ఆధ్వర్యంలో హుండీని లెక్కించగా వచ్చిన ఆదాయం రూ.లక్షా 32 వేల 769లుగా చెప్పారు. అలాగే స్థానిక గాంధీచౌక్ లోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో హుండీ లెక్కించగా, రూ. 18,637 వచ్చినట్లు తెలిపారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎస్.శారదాదేవి పర్యవేక్షణలో జరిగిన హుండీల లెక్కింపులో అర్చకులు వి.రాఘవేంద్ర ప్రసాద్, జంపని నాగభాస్కర్, భక్తులు పి.సూర్యనారాయణ, ఎస్.నిర్మలకుమారి, పి.సుశీల పాల్గొన్నారు.

నేడు బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ సమావేశం

చేబ్రోలు: పొన్నూరు నియోజకవర్గ స్థాయి వైఎస్సార్‌సీపీ సమావేశం శనివారం సాయంత్రం నాలుగు గంటలకు జరుగుతుందని చేబ్రోలు మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ఆళ్ల శ్రీరామిరెడ్డి శుక్రవారం తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు.. పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ సూచనల మేరకు.. బాబు ష్యూరిటీ, మోసం గ్యారెంటీ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

నిఘా నేత్రమే రక్ష

- ఉద్యోగస్తులు, ఒంటరిగా నివసిస్తున్న వారి ఇళ్లకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం సురక్షితం
- సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం మేలంటున్న పోలీసులు



మారిస్‌పేటలోని ఓ ఇంట్లో ఇటీవల ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

తెనాలిరూరల్: తెనాలిలో ఇటీవల జరిగిన ఒంటరి వృద్ధుల హత్యలు ఇప్పుడు భద్రతపై ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. బంగారం, నగదు కోసం ఎప్పుడు ఎవరు ఏం చేస్తారోనన్న కలవరం ప్రజల్లో వ్యక్తమవుతోంది. ఇందుకు భద్రతా చర్యలు తీసుకోవడంతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం మేలని పోలీసు అధికారులు సూచిస్తున్నారు. వీటి ద్వారా నేర నియంత్రణతో పాటు నేరాను జరుగకుండా అరికట్టే అవకాశం ఉందంటున్నారు. నేర పరిశోధనలోనూ ఈ కెమెరాలు ఉపయోగపడతాయని అవకాశం ఉన్న ప్రతి ఇంటిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తున్నారు.

జూన్ నెల మూడో తేదీన స్థానిక ముత్తెంశెట్టి పాలెంలో తాడిపత్రి మల్లీశ్వరి టిఫిన్ బండి నిర్వహిస్తూ ఒంటరిగా జీవిస్తోంది. కుమార్తె, కుమారుడికి వివాహాలవగా వారు ఇదే ప్రాంతంలో వేర్వేరుగా ఉంటున్నారు. ఒంటరిగా ఉంటున్న మల్లీశ్వరి బంగారు ఆభరణాలను ధరించి ఉండడాన్ని ఆమె ఇంటి పక్కనే నివసిస్తున్న 24 ఏళ్ల నన్నెపాముల తారక జోషి గమనించాడు. వివాహమై, చెడు వ్యసనాలతో అప్పులపాలైన అతను మల్లీశ్వరి ఆభరణాలను దోచుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఇందుకు తన తమ్ముడు సతీష్‌కుమార్ సహాయం తీసుకున్నాడు. 3వ తేదీ తెల్లవారుజామున ఐదు గంటలకు మల్లీశ్వరి నీళ్ల కోసం పంపు వద్దకు రాగా ఆమె గొంతునులిమి హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని ఇంట్లోకి తీసుకెళ్లి మంచంపై పడుకోబెట్టి, ఆభరణాలను దోచుకెళ్లారు. రెండో తేదీ అర్ధరాత్రి నుంచి మూడో తేదీ తెల్లవారు జాము వరకు ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాల పుటేజీలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించగా తారక జోషి ఆ రాత్రంతా తిరుగుతూనే ఉన్నట్టు గుర్తించారు. అనుమానంతో అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది.

తెనాలిలో ఇటీవల జరిగిన ఇద్దరు వితంతు వృద్ధ మహిళల మర్డర్‌లో నేరస్తులను సీసీ కెమెరాల పుటేజీల ఆధారంగా పోలీసులు సునాయాసంగా అదుపులోకి తీసుకోగలిగారు. మృతి చెందిన వారిలో దాసరి రాజేశ్వరి కుమార్తె చెన్నైలో, కుమారుడు విదేశాల్లో ఉంటున్నారు. వీరు తల్లి ఎలా ఉందోనని చూసుకోవడం కోసం ఇంటికి సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకున్నారు. ఎవరు వచ్చి వెళ్లేదీ ఇంటి చుట్టూ ఏం జరుగుతోందన్నది కెమెరాల ద్వారా గమనిస్తూ ఉంటారు. హత్యలు జరిగిన రోజు కుమార్తె ఫోన్ చేస్తే సమాధానం లేకపోవడం, ఇంటికి ఎవరో వచ్చి వెళ్లినట్టు సీసీ కెమెరాల పుటేజీలో చూసి వెంటనే తెనాలిలోని బంధువులకు చెప్పడంతో వారు వెళ్లి చూడగా దారుణ హత్యల ఉదంతం వెలుగులోకి వచ్చింది. నిందితులు పెరవలి కుసుమ కుమారి, ఇళ్ల గోపీకృష్ణ, మరో మైనర్‌ను పోలీసులు సీసీ పుటేజ్ ఆధారంగా త్వరితగతిన అదుపులోకి తీసుకున్నారు.

ఈ రెండు హత్యలు తెనాలి మారిస్‌పేట రెండు గేట్ల మధ్య ప్రాంతం, మల్లెపాడు వాసులను తీవ్ర కలవరానికి గురి చేసింది. ముఖ్యంగా పోలీసులు అదుపులోకి తీసుకున్న నిందితులు మే నెలలో మరో మహిళను హత్య చేసినట్టు అంగీకరించడం ఇక్కడి వారిని భయ భ్రాంతులకు గురి చేసింది. ఒంటరిగా నివసిస్తున్న కొందరు వృద్ధ మహిళలు తమ బిడ్డల వద్దకు లేదా బంధువుల వద్దకు వెళ్లి ఉంటున్నారు. అవకాశం ఉన్న వారు తమ ఇళ్లకు సీసీ కెమెరాలు పెట్టుకుంటున్నారు.

సీసీ కెమెరాలు నేరం జరిగాక పరిశోధనకు మాత్రమే కాక నేర నియంత్రణకూ సహకరిస్తాయి. కొన్నిసార్లు ప్రజల ఆస్తుల, ప్రాణాలనూ కాపాడతాయి. సాధారణంగా ఇల్లు వదిలి వెళ్లి కొన్ని రోజులు కుటుంబమంతా ఎక్కడైనా ఉండాల్సిన పరిస్థితి వస్తే ఇల్లు ఎలా ఉందోనన్న ఆందోళన ఉంటుంది. భద్రత విషయంలో మనవంతు జాగ్రత్తగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ఎంతో ముఖ్యం. దాంతో ఎక్కడి నుంచైనా మన ఇంటి ఆవరణలో ఏం జరుగుతుందనేది మానిటర్ చేయొచ్చు. కేవలం ఇంటి అవసరాల కోసమే కాదు.. షాపులు, పరిశ్రమలు ఇతరత్రా అవసరాల కోసం సెక్యూరిటీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవచ్చు.

కెమెరాలు, అలారం ఏర్పాటు మేలు



ఒంటరిగా ఉంటున్న వృద్ధులు, మహిళలు తమ ఇళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం మంచిది. దీంతో పాటు అవకాశం ఉన్న వారు అలారం సిస్టంను పెట్టుకోవడం మేలు. వీటి ద్వారా భద్రత ఉండడంతో పాటు నేరాల నియంత్రణ సాధ్యమవుతుంది. అపరిచిత వ్యక్తులను ఇంటిలోకి రానీయకుండా జాగ్రత్తలు తీసుకునే అవకాశం ఉంటుంది.

-బి.జనార్ధనరావు, డీఎస్పీ

అందుబాటు ధరల్లో లభ్యం

సాధారణ సెక్యూరిటీ కెమెరాలకు వైర్ కనెక్షన్‌తో పాటు, డేటా స్టోరేజ్ కోసం పీసీ ఉండి తీరాలి. అంతేకాకుండా అది ఖర్చుతో కూడిన వ్యవహారం. అదే వైఫై సెక్యూరిటీ కెమెరాలైతే రికార్డ్ చేసిన మొత్తం డేటా క్లౌడ్లో స్టోర్ చేస్తుంది. అలానే దాన్ని మీ మొబైల్ నుంచే ఆపరేట్ చేయొచ్చు. ఇవి ప్రస్తుతం మార్కెట్‌లో రూ. 800 నుంచి అందుబాటులో ఉన్నాయి. వినియోగదారుడి ఆర్థిక స్థితిని బట్టి వీటిలోని రకాలను ఎంచుకోవచ్చు. దూరవు ప్రాంతాల్లో ఉండి తల్లిదండ్రులను సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తూ ఉండే వారు వీటి నుంచి మాట్లాడే అవకాశమూ ఉంది. ప్రస్తుత కాలంలో ప్రతి ఇంటిలో సీసీ కెమెరాలను అమర్చుకోవడం ఎంతైనా అవసరమని పోలీసులు అంటున్నారు.

అభివృద్ధి పథంలో తెనాలి పట్టణం



కాల్వలను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రాధిక, కౌన్సిలర్లు అనిత, పిన్నారావు

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక

తెనాలిఅర్బన్: పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. పట్టణంలోని 16,17 వార్డులలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక పారిశుద్ధ్య పనులను ఆమె పరిశీలించి పలు సూచనలు చేశారు. కాల్వలపై అక్కడక్కడ రాళ్లు వేసి ఉండటాన్ని గమనించిన ఆమె వాటిని తొలగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు అన్నం పిన్నారావు, దీవి అనిత, మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ ముఖ్వా యేసుబాబు, టీపీవో సాంబశివరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా టౌన్‌చర్చి శతవార్షిక మహోత్సవాలు



సెయింట్‌జాన్స్ స్కూల్ అధినేత సూరజ్‌మోహన్, యాని దంపతులకు సత్కారం

తెనాలి: ఆంధ్ర ఇవాంజెలికల్ లూథరన్ చర్చి (ఎఈఎల్‌సీ) తూర్పు గుంటూరు సినడు పరిధిలో తెనాలిలో గల క్రీస్తు దేవాలయం (టౌన్‌చర్చి) శతవార్షిక మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉదయం కీర్తనలతో రెండోరోజైన శుక్రవారం వేడుకలను ఆరంభించారు. టౌన్‌చర్చి ప్యారిష్ పాస్టరు రెవరెండ్ దేవరపల్లి ఏసురత్నం, అడిషనల్ పాస్టర్లు యామర్తి లెనిన్‌బాబు, దగ్గుమల్లి సాల్మన్‌రాజు, మత్తె విజయభాస్కర్ ప్రకాష్‌బాబు ఆరాధన జరిపారు. బేతాళ కిషోర్‌బాబు బైబిల్ పాఠం, గేరా ప్రమీలరాజు సువార్త పాఠం చదివారు. పాస్టర్ యామర్తి రోజ్‌లీనా లెనిన్ ప్రార్థన చేశారు. తదుపరి వరల్డ్ కౌన్సిల్ ఆఫ్ చర్చెస్ మాజీ కార్యదర్శి, స్టూడెంట్ క్రిస్టియన్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు రెవరెండ్ డాక్టర్ మంచాల దీనబంధు వాక్య సందేశం ఇచ్చారు. శతవార్షిక మహోత్సవాల కన్వీనర్, క్రిస్టియన్ జేఏసీ కన్వీనర్ పిల్లి విద్యాసాగర్ చర్చి సుందరీకరణ వివరణనివ్వగా, ప్యారిష్ పాస్టర్ రెవ.దేరపల్లి ఏసురత్నం విస్తరణ, సుందరీకరణను వివరించారు. తదుపరి చల్లాపల్లి ఫ్రాన్సిస్ జేవియర్, గేరా రాజు ఆధ్వర్యంలో వాక్యోపదేశకులు, అతిథులు, విశ్రాంత పాస్టర్లు, పూర్వపు సంఘకాపరులు, మాజీ చైర్మన్లు, కోశాధికారులను ఘనంగా సత్కరించారు. సాయంత్రం డాక్టర్ జమండ్లపూడి ప్రశాంత్‌కుమార్ అధ్యక్షతన ప్రత్యేక పాటలు, కీర్తనలను ఆలపించారు. రెవ.డాక్టర్ కొల్లూరు రిచర్డ్సన్ వాక్య సందేశం ఇవ్వగా, అంబేడ్కర్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్, తెనాలి సెక్రటరీ, కరస్పాండెంట్ మన్నవ మేరీగ్రేస్, భువనగిరికి చెందిన డాక్టర్ దేవరపల్లి జాన్సన్ శుభాకాంక్షలు తెలియజేశారు. మూడోరోజు ఉత్సవాల్లో భాగంగా లూథరన్ అప్పర్ ప్రైమరీ స్కూలు మైదానంలో ప్రేమవిందు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

ఉన్నత లక్ష్య సాధనకు కృషి చేయండి



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించిన విజయ్‌కుమార్, శివశంకర్

తెనాలిఅర్బన్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని వాటిని సాధించే దిశగా కృషి చేయాలని న్యాయవాది పొన్నం విజయ్‌కుమార్ పేర్కొన్నారు. పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో కొత్తపేటలోని రావి సాంబయ్య మున్సిపల్ బాలురోన్నత పాఠశాలలో పదోవ తరగతి ఫలితాల్లో మొదటి మూడుస్థానాలు సాధించిన విద్యార్థులను బట్ట అంజయ్యబాబు, అనురాధల సౌజన్యంతో శుక్రవారం సన్మానించి మెమోంటోలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు భారతి మాట్లాడుతూ విద్యపట్ల ఆసక్తిని పెంపొందించుకుని మంచి ఫలితాలు సాధించే విధంగా కృషి చేయాలన్నారు. పూర్వ విద్యార్థుల సంఘం వ్యవస్థాపకుడు తన్నీరు శివశంకర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి బాగా చదువుకుని స్కూల్‌కు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాసరనేని శ్రీనివాసరావు, కుంభకోణం శ్రీనివాసరాం, పొట్టి నరేంద్ర, ఈఎల్‌వి అప్పారావు, పిడుగురాళ్ళ వీరభద్రరావు, శెట్టిపల్లి సుబ్రమణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకునేందుకు సీఎంఆర్‌ఎఫ్ దోహదం

పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



చెక్కులు అందుకున్న బాధితులతో మంత్రి మనోహర్

తెనాలిఅర్బన్: అనారోగ్యంతో బాధపడే వారికి ఆర్థిక చేయూతనిచ్చేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు దోహదపడతాయని రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. తెనాలిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం 50 మందికి రూ.50,35,290 విలువ చేసే చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెనాలి నియోజకవర్గంలో ఇప్పటి వరకు రూ.2.90 కోట్ల విలువ చేసే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేసినట్లు చెప్పారు.

ఉర్దూ హైస్కూల్ ఏర్పాటుకు చర్యలు

తెనాలిఅర్బన్: తెనాలిలో ఉర్దూ హైస్కూల్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. మారీసుపేటలోని ఎన్‌సీఆర్‌ఎన్‌ఎంహెచ్ ఆవరణలో ఉన్న మున్సిపల్ ఉర్దూ ఎలిమెంటరీ స్కూల్ ఆధునీకరణ పనులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెనాలి పట్టణంలో పలు చోట్ల ఉర్దూ ఎలిమెంటరీ స్కూల్‌లు ఉన్నాయని చెప్పారు. అలాంటి విద్యార్థులు హైస్కూల్ చదువుల కోసం ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని నూతన హైస్కూల్ ఏర్పాటుకు ప్రభుత్వ అనుమతులు తీసుకురానున్నట్లు చెప్పారు. పాఠశాలను సొంత నిధులు రూ.70వేలతో ఆధునీకరించిన ప్రధానోపాధ్యాయురాలు భట్టిప్రోలు మాధవిని, ఆమె కుటుంబ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఖలేదా నసీమ్, ఎంఈవో-2 వి.జయంతిబాబు, ఎన్‌సీఆర్ స్కూల్ హెచ్‌ఎం కరిముల్లా, ఉపాధ్యాయులు వెంకట్, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

సమాజానికి మరిన్ని సేవలు విస్తృతం చేస్తాం

రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్



పిల్లలకు విద్యాసామగ్రి అందజేస్తున్న సభ్యులు

తెనాలిటౌన్: రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం సభ్యుల సహకారంతో సమాజానికి మరిన్ని సేవలు అందిస్తామని క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పినపాడులోని మున్సిపల్ ఉర్దూ పాఠశాలలోని విద్యార్థులకు నోటుబుక్స్, తినుబండరాలను పంపిణీ చేశారు. అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్ పాల్గొని విద్యార్థులకు వీటిన్ని అందజేశారు. క్లబ్ కార్యదర్శి జి.వి.నారాయణ సహకారంతో విద్య సామగ్రి అందించినట్లు చెప్పారు. రాబోయే రోజుల్లో సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావు, గుత్తా వెంకటరత్నం, ఈదర శ్రీనివాసరావు, మల్లాది అర్జున, కొల్లి రాజేంద్రప్రసాద్, ఆలపాటి వెంకట్రామయ్య, తదితరులు ఉన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి యూనియన్ కృషి



కేక్ కట్ చేస్తున్న మహిళా నాయకులు లక్ష్మీపార్వతి, భూలక్ష్మి

తెనాలిఅర్బన్: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎంప్లాయిస్ యూనియన్ ఎంతో కృషి చేస్తుందని సంఘ జిల్లా కార్యదర్శి ఈపూరి విజయ్ కుమార్ పేర్కొన్నారు. ఏపీ పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ 74వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆర్టీసీ డిపో ఆవరణ వద్ద శుక్రవారం నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన కేక్‌ను మహిళా నాయకులు లక్ష్మీపార్వతి, భూలక్ష్మి కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బి.సాంబశివరావు, పి.యలమందయ్య, డిపో అధ్యక్ష కార్యదర్శులు కె.బాబు, ఎస్.సుధాకరరావు, బి.శ్రీనివాసరావు, దీపాల శివ శ్రీనివాసరావు, వి.జోషి బాబు, ఐమళ్ళ రాజేషఖన్నా, తదితరులు పాల్గొన్నారు.

పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి



కాకుమాను: పెదనందిపాడు మండలంలో పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ కుమార్ అన్నారు. పెదనందిపాడులో శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కాకుమాను మండలంలో ఏర్పాటు చేసిన పొగాకు కొనుగోలు కేంద్రంలో కేవలం 5 గ్రామాలలోని రైతుల నుంచి మాత్రమే పొగాకు కొనుగోలు చేస్తున్నారని ఆయన తెలిపారు. పెదనందిపాడు మండలంలో 16 గ్రామాలలోని రైతులు పొగాకు సాగు చేశారని.. అయినప్పటికీ మండలంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని.. కానీ నేటికీ దానిని ఏర్పాటు చేయకపోవడం అన్యాయమని అన్నారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి కొత్త వెంకట శివరావు, నల్లమోతు రాజేంద్ర, పసుపులేటి శేషగిరిరావు, మదమంచి అప్పారావు, రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తెనాలిటౌన్: పట్టణ, రూరల్ ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బొరుగడ్డ అశోక్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కె.వి.లైన్‌లు మరమ్మతులు, లైన్‌లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగింపు పనులు జరుగుతున్న కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

కొల్లిపరలో....

కొల్లిపర: విద్యుత్ మరమ్మతుల నిమిత్తం శనివారం మండల పరిధిలోని అన్నవరం ఫీడర్, వల్లభాపురం ఫీడర్ క్రింద ఉదయం ఎనిమిది గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు మండల విద్యుత్ ఏఈ ప్రదీప్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నవరం ఫీడర్ పరిధిలో అన్నవరం అన్నవరం గౌడ్ పాలెం హనుమాన్ పాలెం తూములూరు దావులూరు పాలెం పాత బొమ్మువానిపాలెం , వల్లభాపురం ఫీడర్ పరిధిలో అత్తలూరు వారి పాలెం వల్లభాపురం, దంతలూరు, ఆతోట తదితర గ్రామాల్లో విద్యుత్ నిలిపివేస్తున్నట్లు కావున వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

పెదనందిపాడు ఇన్‌చార్జి ఎంఈఓగా కెన్నడీ

కాకుమాను: పెదనందిపాడు మండల ఇన్‌చార్జి మండల విద్యాశాఖాధికారిగా కె.ఎఫ్.కెన్నడీ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ప్రస్తుతం కాకుమాను మండల ఎంఈఓగా పనిచేస్తున్నారు. గతంలో ఇక్కడ ఎంఈఓగా పనిచేసిన శ్రీనివాసరావు పెదనందిపాడు మండలంలోని పాలపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా బదిలీ అయ్యారు.

యువకుడు అనుమానాస్పద మృతి

రేపల్లె: అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని యువకుడు మృతి చెందిన ఘటన పెటేరులో చోటు చేసుకుంది. పట్టణ సీఐ మల్లికార్జునరావు కథనం ప్రకారం పెటేరులోని చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రం సమీపంలో సుమారు 30 సంవత్సరాల వయస్సు గల యువకుడు గొంతు కోసి మృతి చెంది ఉన్నాడన్నారు. మృతుని వివరాలు తెలియరాలేదని చెప్పారు. వీఆర్వో నీలా మహేష్‌బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించామన్నారు. వివరాలు తెలిసినవారు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం



పొన్నూరు: స్థానిక ఆర్టీసీ డిపో వద్ద ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ 74వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. డిపో ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు ఆర్.జి.రాజు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. యూనియన్ నాయకులు వేణుగోపాల్ యూనియన్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ డిపో కార్యదర్శి ఏ. ఏ. బేగ్ మాట్లాడుతూ.. 1952 సంవత్సరంలో ఏర్పడిన ఎంప్లాయిస్ యూనియన్ ఇప్పటివరకు ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎన్నో పోరాటాలు చేసి హక్కులు సాధించిందని అన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షులు ఆరేటి రామారావు, కరిముల్లా, ఎస్.రావు ట్రెజరర్ ఖాశీం, సంయుక్త కార్యదర్శి ఎస్‌కె. కరీముల్లా, టి.వి.రామయ్య, జి.రాణి, శివ, బుజ్జి, అమిరుల్ల, గ్యారేజీ నాయకులు ఎంపీ.రావు, లెనిన్, జి.ఆర్. బాబు, ఎల్. వెంకటేశ్వర్లు, మెకానిక్ నాగ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

జనాభా సమస్యపై విద్యార్థుల చర్చావేదిక



తెనాలి: ప్రపంచ జనాభా దినోత్సవం రోజైన శుక్రవారం స్థానిక ఏఎస్ఎన్ ఫార్మసీ కాలేజీలో ఐపీఏఎస్ఎఫ్-ఏఎస్ఎన్ చాప్టర్ ఆధ్వర్యంలో విద్యార్థులతో చర్చా కార్యక్రమం నిర్వహించారు. 'జనాభా పెరుగుదల-అభివృద్ధికి అడ్డంకా? లేదా అవకాశమా? అనే అంశంపై విద్యార్థులు రెండు పక్షాలుగా చర్చ చేశారు. విద్యార్థులు తమ అభిప్రాయాలను వివరించగా, అధ్యాపకులు, సంస్థ ప్రతినిధులు ప్రశంసించారు. కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ మాట్లాడుతూ జనాభా సమస్యపై యువతకు అవగాహన కల్పించటానికే చర్చా కార్యక్రమం నిర్వహించినట్టు చెప్పారు. ఇటువంటి చర్చలతో విద్యార్థులు సమాజ సమస్యలను లోతుగా అర్థం చేసుకుంటారని చెప్పారు. ఐపీఏఎస్ఎఫ్-ఏఎస్ఎన్ చాప్టర్ మెంటార్ పి.భార్గవి అధ్యక్షత వహించారు. విజేతలకు డాక్టర్ టి.జ్యోతిబసు, కె.కళ్యాణ్ చక్రవర్తి ప్రశంసాపత్రాలను, జ్ఞాపికలను అందజేశారు.

పూర్తయిన రౌడీషీటర్ అంత్యక్రియలు

తెనాలిరూరల్: ఐతానగర్ చెరువులో అనుమానాస్పదంగా మృతి చెంది ఉన్న రౌడీషీటర్ మాతంగి భరత్ అంత్యక్రియలు పూర్తయ్యాయి. భరత్ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమివ్వగా టూ టౌన్ పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టమ్ నిమిత్తం తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. పోస్ట్‌మార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించగా రాత్రికి ఐతానగర్ శ్మశాన వాటికలో అంత్యక్రియలు పూర్తయ్యాయి. వైద్యశాల నుండి మృతదేహాన్ని ఊరేగింపుగా తీసుకురావడంతో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండ పోలీసులు ఐతానగర్‌లో బందోబస్తు ఏర్పాటు చేశారు. గుంటూరు నుంచి వచ్చిన సీఐలు అశోహరి శ్రీనివాస్, నరసింహారావులు పెత్త ఎత్తున సిబ్బంది బందోబస్తును ఇక్కడి పోలీసులతో కలసి పర్యవేక్షించారు.